


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 11 ఆగస్టు 2025

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు వీరే...

సొసైటీ పేరు	చైర్మన్ పేరు
కొట్టాలపల్లి	గడ్డం వెంకటసామయ్య
గుండాలమ్మపాలెం	బీ వినీల్‌కుమార్‌రెడ్డి
పొదలకూరు	తలచీరు మస్తాన్‌బాబు
చింతారెడ్డిపాలెం	చింతా ప్రభాకర్‌రెడ్డి
కలివెలపాలెం	చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి
కోడూరుపాడు	గంగి జయరామిరెడ్డి
మాదరాజుగూడూరు	బైనబోయిన సుధాకర్
గుండ్లపాలెం	పముజుల ప్రదీప్
ఇందుకూరుపేట	గండవరపు అమర్నాథ్‌రెడ్డి
నిడిముసలి	చిరమన వినీల్‌రెడ్డి
ఆత్మకూరు	పరిటాల సత్యనారాయణ
యన్నవాడ	కొల్లి నరసయ్య నాయుడు
రాజవోలు	కాటంరెడ్డి నరసింహారెడ్డి
అనంతసాగరం	మెట్టుకూరు ధనుంజయరెడ్డి
చేజర్ల	బూదళ్ల బీరరాఘవరెడ్డి
కావలి	కాటా భాస్కర్‌రెడ్డి
మద్దూరుపాడు	గుంటూరు మల్లికార్జున్
సర్వాయపాలెం	నండు వెంకయ్య
ఇందుపూరు	ఎండేటి హరికృష్ణ
జలదంకి	కరియావుల అప్పలనాయుడు
కలిగిరి	కదిరి రంగారావు
సిద్ధలకొండూరు	మెట్టుకూరు కృష్ణజీవిరెడ్డి
కుడుములదిన్నెపాడు	భాష్యం నరసింహులు నాయుడు
గరిమెనపెంట	అల్లిక మధు
గుడవల్లూరు	కంకు మోహన్‌రావు
పెదపుత్తేడు	ఈదల రవికృష్ణారెడ్డి
నందిపాడు	మండల మధు
బూదవాడ	వనిపెంట వెంకటసుబ్బారెడ్డి
భీమవరం	యర్రమల్ల చిన్నారెడ్డి
మారంరెడ్డిపల్లి	సోమనబోయిన రాజశేఖర్
వరికుంటపాడు	గుర్రం గోపి
వింజమూరు	చల్లా వెంకటేశ్వర్లు
పడుగుపాడు	నాగారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి
బుచ్చిరెడ్డిపాలెం	ఏటూరి శివరామకృష్ణారెడ్డి
వవ్వేరు	దొడ్ల విజయలక్ష్మి
దామరమడుగు	రెనగాళ్ల సిద్ధార్థ
తలమంచి	పీ సూర్యనారాయణ
యల్లాయపాలెం	వై వంశీధర్‌రెడ్డి
సంగం	గుండ్లపల్లి శ్రీనివాసులు
ముదివర్తి	తన్నీరు రాజయ్య
మహదేవపురం	నల్లూరు సుబ్బారావు
ఎర్రారెడ్డిపాలెం	బలుసు లింగయ్య
చిన్నపవని	ముల్లపాటి లక్ష్మీనరసింహ చౌదరి
పోకూరు	గట్టమనేని లక్ష్మీనరసింహ
బడేవారిపాలెం	ఉన్నం రంగారావు
గుడ్లూరు	దామా వెంకటేశ్వర్లు
దరకానిపాడు	నరాల మాలకొండారెడ్డి
ఉలవపాడు	రాచగల్ల సుబ్బారావు
చాగల్లు	రాయపాటి వెంకట మహేశ్వరరావు
మనుబోలు	పొన్నూరు రామకృష్ణయ్య
కృష్ణపట్నం	పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి
పేడూరు	గూడూరు నారాయణ
టీపీ గూడూరు	సన్నారెడ్డి సురేష్‌రెడ్డి
చౌటపాలెం	ఆర్ రాధాకృష్ణమనాయుడు
రాపూరు	దందోలు వెంకటేశ్వరరెడ్డి
కలువాయి	గడిపర్తి జగదాలనాయుడు
సైదాపురం	అమ్మినేని సుబ్రహ్మణ్యం

మరి కొందరు

‘నామినేటెడ్’

ఒకేసారి 57 పీఏసీఎస్‌లకు కమిటీలు
ఒక్కో కమిటీలో ముగ్గురికి చోటు

- ప్రభుత్వ ఉత్తర్వుల జారీ
- కష్టపడ్డవారికి దక్కిన న్యాయం

నెల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌ల)కు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఆరునెలల క్రితమే ఎమ్మెల్యేలు వారి పరిధిలోని పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల కింద పేర్లను నామినేట్ చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే సాంకేతిక కారణాలతో కొత్త కమిటీల ఏర్పాటులో జాప్యం జరిగింది. కానీ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పీఏసీ ఎస్‌లకు పాలకవర్గాలు నియమిస్తూ జీవోలు జారీ అయ్యాయి. ఒక్క నెల్లూరుజిల్లాలోనే 57 సంఘాలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. ఒక్కో కమిటీలు ముగ్గురికి చోటు కల్పించారు. వారిలో ఒకరిని చైర్‌పర్సన్‌గా నియమించారు. గతనెలలో మూడు కమిటీలకు పాలకవర్గాలను నియమించారు. మొత్తంగా చూసుకుంటే జిల్లాలో 78 పీఏసీఎస్‌లు ఉండగా, అందులో ఓగూరు, ముసునూరు పీఏసీఎస్‌లను రద్దు చేసేందుకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఇక మిగిలిన 76 సంఘాలకుగా నూ ఇప్పటికి 60 సంఘాలకు కమిటీలను నియమించారు. మిగిలిన 16 సంఘాలకు త్రీమెన్ కమిటీలు నియమించాల్సి ఉంది. తాజాగా విడుదలైన ఉత్తర్వుల ప్రకారం ఒకేసారి 171 మందికి నామినేటెడ్ పదవులు దక్కాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారు ఈ జాబితాలో ఉన్నారు. కష్టకాలంలో పనిచేసిన వారికి ఆయా పార్టీలు ప్రాధాన్యం ఇచ్చాయి. ఇంత పెద్దసంఖ్యలో ఒకేసారి నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంతో అధికార పార్టీల్లో సందడి నెలకొంది. కాగా వైసీపీ ప్రభుత్వంలో నియమించిన కమిటీల గడువు గతేడాది ముగిసింది. అప్పటి నుంచి అధికారులే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా నూతన కమిటీల నియామకంతో వ్యవసాయ పరపతి సంఘాల పాలన తిరిగి గాడిలో పడనుంది.

గురుకులంలో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

కావలి రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంట బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో మిగిలిన 18సీట్లకు ప్రవేశ పరీక్ష నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 14 సాయంత్రం 5 గంటల లోపు తుమ్మలపెంట పాఠశాలలో అందజేయాలని తెలిపారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 8712625048, 9247245429, 9963885240ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రోజుకో టీఎంసీ!

- సోమశిలకు కృష్ణా జలాల రాక
- నెల నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ఇప్పటి వరకూ 25 టీఎంసీల రాక
- ఈ ఏడాది రెండు ప్రాజెక్టులకు జలకళ
- రానున్న సీజన్‌లో సాగుకు ఢోకా లేదు...!



నెల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల రాకతో పెన్నమ్మ పులకరిస్తోంది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కృష్ణా జలాలు సోమశిలకు చేరుతున్నాయి. రికార్డు స్థాయిలో ఈ ఏడాది కృష్ణానదికి జూలైలోనే వరదలు పోటెత్తడంతో జిల్లాకు కలిసొచ్చింది. మరో నెల పాటు ఇలాగే ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నా యి. దీంతో ఈ ఏడాది మొదటి పంటకు ఢోకా ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి ఆయకట్టులో సాగు చేపట్టేందుకు అవసరమైన నీరు ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరుతోంది. గతేడాది మాదిరిగానే ఈ దఫా కూడా సోమశిల, కండలేరు జలాశయాలు కృష్ణాజలాలతో జళకళను సంతరించుకోనున్నాయి.

● లోటు వర్షపాతం ఉన్నా జలకళ

ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉండటం, దానికితోడు లోటు వర్షపాతం కూడా నమోదవడంతో రైతులు ఆందోళన చెందారు. పెన్నా పరివాహకంలో వర్షాలు కురవకపోతే మొదటి పంట సాగు ఎలా.. అన్న చింత వారిలో ఉండేది. అయితే కృష్ణానదికి వరదలు పోటెత్తడం, శ్రీశైలం నిండుకుండలా మారిపోవడంతో వెంటనే ప్రభుత్వం మేల్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణాజలాలను సోమశిలకు తరలించడం ప్రారంభించింది. జూలై 9 నుంచి సోమశిలకు కృష్ణా జలాల రాక మొదలైంది. తొలుత 4 వేల క్యూసెక్కులు మాత్రమే వస్తుండగా, క్రమేణా దాన్ని ఇప్పుడు 16 వేల క్యూసెక్కులకు పెంచారు. గత పది రోజులుగా 15 వేల క్యూసెక్కులకు తగ్గకుండా ఇన్‌ఫ్లో వస్తున్నది. మొత్తంగా ఈ నెల రోజుల్లో 25 టీఎంసీల నీరు సోమశిల, కండలేరుకు వచ్చి చేరింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు ముందుచూపుతో ఆలోచించి, సోమశిల నుంచి కండలేరుకు నీటి విడుదల ప్రారంభించారు. రోజూ 6 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇలా సోమశిలలో 22 టీఎంసీలు, కండలేరులో మరో 3 టీఎంసీల నీరు కృష్ణా జలాలు చేరాయి.

● ఈ ఏడాది పుష్కలమే..!

ఈ ఏడాది ఇప్పటికే శ్రీశైలం మొదలు ప్రకాశం బ్యారేజీ వరకు అన్నీ జలాశయాలు పూర్తిగా నిండాయి. శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టుల్లో 90శాతం నీరు నిల్వ ఉండగా, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీల వద్ద 99 శాతం నీరు నిల్వ ఉంది. అదే సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు ఇంకా వరద కొనసాగు తోంది. ఆదివారం ఉదయం కూడా 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో కృష్ణా డెల్టా ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకునేందుకు ఇక అవకాశం లేదు. కాబట్టి రానున్న నెల రోజుల్లో కృష్ణా జలాల రాక సోమశిలకు కొనసాగే అవకాశాలు న్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సాగవు తున్న రెండో పంటకు మరో నెలపాటు నీరు ఇవ్వాల్సి ఉంది. అందుకు మరో 10 టీఎంసీల వరకూ ఖర్చవుతుంది. ఈ నెల రోజుల్లో మరో 30 టీఎంసీలు కృష్ణాజలాలు తీసుకురాగలిగితే మొత్తంగా 60 టీఎంసీల వరకూ సోమశిలలో ఉండే అవకాశముంది. అప్పుడు మొదటి పంటను పూర్తి ఆయకట్టులో సాగు చేసేందుకు వీలు కలుగుతుంది. ఇక కండలేరులో కూడా ప్రస్తుతం 26 టీఎంసీల నీరు ఉంది. ఈ జలాశయం కింద కూడా మొదటి పంటకు పూర్తి విస్తీర్ణానికి నీటి కేటాయింపులు ఇచ్చే అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈలోపు పెన్నా పరివాహకంలో వర్షాలు కురిస్తే సోమశిల, కండలేరు జలాశయాలను వచ్చే ఏడాది రెండో పంటకు కూడా సరిపడేలా నీటి నిల్వ చేసుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తంగా కృష్ణా జలాల రాక జిల్లా రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరస్తోంది.

15,916 క్యూసెక్కుల వరద రాక

ఆరో నంబరు గేటు మూసివేత

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగవ నుంచి ఆదివారం 15,916 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో జలాశయం నీటిమట్టం 39.353 టీఎంసీలకు చేరుకోగా, ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఆరో నంబరు గేటు మూసి నీటిని నిలుపుదల చేశారు. దీంతో సోమశిల నుంచి నెల్లూరుకు రాకపోకలు కొనసాగాయి.

కండలేరు ఇన్‌ఫ్లో 5,280 క్యూసెక్కులు

రాపూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి నీటి మట్టం 25.917 క్యూసెక్కులుగా ఉందని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 5280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1945 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.

జలజీవన్ మిషన్ పైలాన్,
శిలాఫలకం ధ్వంసంపై కేసు

- ఏడుగురిపై నమోదు, ఇద్దరి అరెస్టు
- నిందితులంతా వైసీపీ నేతలే..

కావలి,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తుమ్మలపెంటలో జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనపై ఏడుగురిపై కేసు నమోదు చేశామని, వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పీ. శ్రీధర్ తెలిపారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. ఈ సంఘటనలో నిందితులంతా వైసీపీ వారేనని పేర్కొన్నారు. వైసీపీ నేతలే వాటిని పగులకొట్టి కూటమి నేతలపై నెట్టే ప్రయత్నాలు చేశారన్నారు. వైసీపీ నేతల లేఅవుట్‌కు రోడ్డుకు మధ్యలో పైలాన్, శిలాఫలకం అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించి లేఅవుట్‌కు దారి ఇస్తామని, గతంలో పొలం అమ్మినప్పుడే పామంజి యానాదయ్య చెప్పారన్నారు. దీంతో వైసీపీ నాయకులు పథకం ప్రకారం ఈనెల 6 అర్ధరాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా ఆపు చేయించి, కోడూరు జక్కరయ్య ఎక్స్‌కవేటర్‌తో శిలఫలకం ధ్వంసం చేసి వాటి శిథిలాలను ఆయన పొలంలోనే వేశారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో కోడూరు జక్కరయ్య, పామంజి యానాదయ్య, కోడూరు ప్రేమసాగర్, వాయిల తిరుపతయ్య, కుమారి రాజు, కుమారిశ్రీను అలియాస్ డీలర్ శ్రీను, కొల్లు ఏడుకొండలను ప్రధాన నిందితులుగా గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి, వారిలో కోడూరు జక్కరయ్య, పామంజి యానాద య్యను అరెస్ట్ చేశామని చెప్పారు. పైలాన్, శిలాఫలకం ధ్వంసం చేయడానికి వినియోగించిన ఎక్స్‌కవేటర్‌ను, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు విచారణలో ఉందని, మిగిలిన నిందితులకోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ రాజేశ్వరరావు, సర్కిల్ సీఐ పాపారావు, ఒకటో పట్టణ, రెండోపట్టణ సీఐలు ఎండీ .ఫిరోజ్, గిరిబాబు, ఎస్‌ఐలు తిరుమల రెడ్డి, బాజీబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, పాల్గొన్న సీఐలు

● విద్వేషాలు రెచ్చగొట్టేందుకే...

ప్రశాంతంగా ఉండే తీరగ్రామాల్లోని మత్స్యకారుల మధ్య, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే క్రమంలో వైసీపీ నేతలే వాటి ధ్వంసానికి పాల్పడ్డారు. వారి కుట్రలు స్థానికులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన పైలాన్ కూల్చివేత ల చిత్రాలతో బట్టబయలయ్యాయి. అంతేకాక టీడీపీ నేతలు కూల్చివేశాశారని దుష్ప్రచారానికి తెరలేపారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామాల్లో ఎలాంటి విద్వేషాలు చెలరేగకుండా ముందస్తు నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- వ్యక్తిగతంగా రైతులను కలుస్తున్న ఇండోసోల్ ప్రతినిధులు
- ఎకరా రూ.20 లక్షలకు అన్నదాతల మొగ్గు

గుట్టుగా
భూసేకరణ

ఉలవపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు మండలంలోని కరేడు గ్రామంలో గుట్టుగా భూసేకరణ చేస్తున్నారు. కరేడు పంచాయతీలోని ఇతర గ్రామాల రైతుల భూములపై వారు దృష్టి పెట్టారు. రైతులను వ్యక్తిగతంగా కలుస్తూ వారిని ఒప్పించి భూములు లాగేసుకుంటున్నారు. 50శాతం భూమి బయట గ్రామాల వారిది కావడంతో పాటు ఎకరాకు రూ.20లక్షలు ఇస్తామని చెప్పడంతో రైతులు కూడా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.

● అంతరేటు వస్తుందా..?

ఎంతకాలం ఎదురు చూసినా కొన్ని భూములకు అంత రేటు పలకడం కష్టమని, వచ్చిందే జమ అన్నట్లు బయట గ్రామాలకు చెందిన కొందరు రైతులు అంటున్నారు.ఈ మాటలు పసికట్టిన ఇండోసోల్ కంపెనీ తమ ప్రతినిధులను రంగంలోకి దింపింది. కరేడు భూసేకరణలో గజిట్‌లో కనపరిచిన ఉలవపాడు, మన్నేటికోట, సింగరాయకొండ, శానంపూడి, కనమళ్ల, గవదగట్లపాలెం, బద్దిపూడి, ఒంగోలు సెటిలర్లు రైతుల వివరాలను సేకరించింది. ఆయా గ్రామాల్లో స్థానిక అధికార పార్టీ నాయకుల సహకారంతో నేరుగా రైతుల దగ్గరకు వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నారు. ఉలవపాడులోని బీసీ ఉప కులాలైన యాదవ, వడ్డెర, కైకాల, చాకలి, డీకే పట్టాలు కలిగిన ఎస్సీ రైతులను ఒక్కొక్కరిగా స్థానిక నాయకులతో ఇండోసోల్ ప్రతినిధులు కలుస్తున్నారు. రెవెన్యూ అధికారులు చెప్తున్నదాని ప్రకారం కరేడు రైతుల భూమి కంటే బయట గ్రామాల రైతుల భూములే 50 శాతంపైనే ఉన్నాయి. ఇదేవిషయాన్ని పసిగట్టిన ఇండోసోల్ కంపెనీ తమ ప్రతినిధులను రంగంలోకి దింపి ఉలవపాడు, మన్నేటికోట, సింగరాయకొండ పరిసర గ్రామాల్లో కరేడు భూములు కలిగిన రైతుల కోసం జల్లెడ పడుతోంది.

● రైతుల మొగ్గు

ఉలవపాడుకు చెందిన రైతుల భూము లు ఎక్కువ భాగం చెరువు ఆయకట్టు కంటే, సపోటా, మామిడి పంటల సాగులో ఉన్నా యి. మరికొందరివి చిల్లకాలువ వెంబడి చౌడు భూములు కావడంతో ఏళ్ల తరబడిన ఎదురుచూసినా రూ.20 లక్షల రేటు పలకదు. అంతధర ఇవ్వడం తమ నెత్తిన పాలుపోసినట్లని ఎక్కువభాగం రైతులు భూములు ఇచ్చేందుకు సమ్మతించారు. మరికొంతమంది రైతులు ఇంకా భూమిరేట్లు పెంచుతారేమో అన్నట్లు ప్రస్తుతానికి ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. ఒకరిని చూసి ఒకరు రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని, రైతులకు నచ్చచెప్పి భూములు ఇచ్చేందుకు ఒప్పించిన నాయకులకు తాయిలాల ఆశలు చూపినట్టు భోగట్టా. మొత్తం మీద గత మూడు వారాల నుంచి ఇండోసోల్ ప్రతినిధులు కరేడు చుట్టుపక్కల ఉన్న బయట గ్రామాల రైతుల దృష్టి పెట్టి భూములు లాగేసుకుంటున్నారు. ప్రస్తుతానికి సుమారు 1500 ఎకరాల భూమికి సంబంధించిన పాసుపుస్తకాలు, ఆధార్ కార్డుల జెరాక్స్‌లు సమ్మతించిన రైతుల నుంచి తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య 8లో..

ఆంధ్రజ్యోతి
నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి
సోమవారం, 11 ఆగస్టు 2025
7
www.andhrajyothy.com

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 505

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9728
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ.121.60

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 22 మందికి రూ.18 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కులను ఆదివారం టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అందచే శారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు ప్రదీప్, వేణు నాయుడు, బద్దేపూడి నరసింహగిరి, చంద్రశేఖర్, మన్నేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు సన్మానం


సన్మాన గ్రహీతలతో నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టౌనుహాలులో ఆదివారం రాత్రి ప్రముఖ జ్యోతిష పండితుడు జీవీబీ మురళీకృష్ణ, ఆధ్యాత్మిక ప్రవచకుడు కోటా రాధాకృష్ణ ఘనంగా సన్మానం జరిగింది. బిగ్‌వేవ్ ఈవెంట్స్ 17వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం సాంస్కృతిక పోటీలు జరిగాయి. విజేతలకు రాత్రి సన్మాన సభలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన నృత్యోత్సవం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎన్ బలరామయ్యనాయుడు, ఎన్‌వీ రమణయ్య, ఈవెంట్స్ అధినేత వై రవిబాబు, జీకే కృష్ణ, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా... పాహిమాం !

వైభవంగా ముత్యాలమ్మ ఊరేగింపు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంగళరావు నగర్ సీ బ్లాక్‌లో ఉన్న ముత్యాలమ్మ దేవస్థానం వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. విశేష అలంకారం మేళతాళాలు, బాణాసంచా వేడుకలలో వెంగళరావునగర్ నుంచి పొదలకూరు రోడ్డు జడ్పీ హైస్కూల్ వరకు వచ్చి తిరిగి ఆలయానికి చేరింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారి మొక్కుబడుల ఉత్సవం కనుల పండువగా జరిగింది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివ చ్చారు. ముత్యాలమ్మ, పోలేరమ్మ, దుర్గాదేవి, భైరవుడు, సుబ్రహ్మణ్యస్వామి తదితర దేవతామూర్తులకు విశేష పుష్ప అలంకారాలతో రథాలు ఏర్పాటు చేసి వాటి కొక్కేల ను వీపులక గుచ్చుకుని ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలను ఎస్ఎం చిరంజీ వి, ప్రకాష్, ప్రశాంత్ పర్యవేక్షించారు. గ్రామోత్సవం అనంతరం చిన్నారులకు కుంభ భోజన కార్యక్రమం నిర్వహించారు.


వీపున కొక్కేలతో రథం లాగుతున్న భక్తుడు


రథంలో విశేష అలంకరణతో అమ్మవారు

వైభవంగా శ్రీవారి కల్యాణం


● ఘనంగా కుంభాభిషేకం


విశేష అలంకరణలో కల్యాణ మూర్తులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోదండరామపురం మహాలక్ష్మీ ఆలయంలో 17వ వార్షికోత్సవం, మహా కుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగాయి. మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం మహాలక్ష్మీ అమ్మవారికి విశేష అభిషేకం, శాంతి పౌష్టిక హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, మహా కుంభాభిషేకం జరిగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి కల్యాణం వైభవంగా జరి గింది. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకట రమణయ్య, సరిత, చంద్రకాంత్, లక్ష్మీ అభినందన వ్యవహరించారు. దేవస్థానం పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

గుండ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రదీప్

● మరో నాలుగు సంఘాలకూ కమిటీలు


ప్రదీప్

నెల్లూరు రూరల్, ఆగస్టు, 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గుండ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్‌గా సౌత్‌మోపూరుకు చెందిన పముజుల ప్రదీప్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. సభ్యులుగా కుండా సురేష్‌రెడ్డి, రాపూరు పెంచలయ్యలను నియమించింది. అలాగే, రూరల్‌లోని చింతారెడ్డిపాళెం పీఏసీఎస్ చైర్మన్‌గా వావిలేటిపాడుకు చెందిన చింతా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులుగా ఆల్తూరి మస్తానయ్య, ఇంగిలాల జీవన్‌బాబు నియమితులయ్యారు. కలివెలపాళెం పీఏసీఎస్ చైర్మన్‌గా చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, సభ్యులుగా దాసరి వెంకట సుబ్బయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, కోడూరుపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా గంగి జయరామిరెడ్డి, సభ్యులుగా మేకల ప్రతాప్, కుడుముల కోటేశ్వరరావు, మాదరాజుగూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా బైనబోయిన సుధాకర్, సభ్యులుగా మాబు వెంకయ్య, బెల్లంకొండ విజయ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

నేత్రదానం



నెల్లూరు (వైద్యం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అల్లీపురానికి చెందిన పాపారెడ్డి బాబురెడ్డి(72) ఆదివారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ సునీల్ ఆ నేత్రాలను సేకరించారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి

నెల్లూరు(విద్య), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శిఖరం నరహరి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ కళాశాల గుర్తింపును రద్దు చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు వివిధ కళాశాలల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒత్తిడికి గురిచేసే విద్యాబోధ నతో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

గంగమ్మకు కిరీటం బహూకరణ

వింజమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమెట్ట వద్ద ఉన్న గంగాభవానీ అమ్మవారికి ఆదివారం హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది గుండ్లపల్లి మాల్యాద్రి యాదవ్ మకర తోరణం, కిరీటం బహూకరించారు. మొక్కుబడిలో భాగంగా సుమారు రూ. 2 లక్షల విలువ చేసే వస్తువులను అమ్మవారికి సమర్పించినట్లు దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ బజార్‌లో తొలుత 120 షాపులు

● మహిళలకు రూ.2లక్షల సబ్సిడీ, రూ.1లక్ష సాయం ● మెప్మా మహిళలతో మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మైపాడు గేటు సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ బజార్‌లో 240 దుకాణాలకుగాను తొలుత 120 ప్రారంభిస్తున్న ట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ తెలి పారు. మహిళలను పారిశ్రామికవేత్తలను చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మైపాడుగేటు సెంటర్ వద్ద దుకాణాలు ఏర్పాటు చేస్తున్న మెప్మా మహిళలతో సమీక్ష జరిపారు. మహిళలకు కార్పొరేషన్, మెప్మా ద్వారా రూ.2లక్షల సబ్సిడీ అందుతుందని, బ్యాంకు ద్వారా ఆ లోన్ మంజూరైందని చెప్పారు. తన సొంత నిధుల నుంచి రూ.లక్ష సాయం చేస్తానని వెల్లడించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు.

ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండండి

నెల్లూరు(సిటీ): ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, వారి నుంచి సమగ్ర వివరాలు సేకరించడం వంటి కార్యక్రమాల అమలులో ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి పొంగూరు నారాయణ సూ చించారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో నగరంలోని సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించాలన్నారు. 9వ డివిజన్‌లో 22 ఎకరాల విస్తీర్ణంలో మోడల్ మార్కెట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడుబండ్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆదివారం చిరు వ్యాపారులను తోపుడు బండ్లను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో చిరు వ్యాపారుల ఇబ్బందులు కళ్లారా చూశానని... అందుకే అద్దె చెల్లించే అవసరం లేకుండా స్వంత నిధులతో తోపుడు బండ్లు ఇస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా 47 మందికి తోపుడు బండ్లను, ఐదుగురికి ఇస్త్రీ బండ్లు, ఒక చెక్క రిక్షా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు.


చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేస్తున్న మంత్రి నారాయణ

'బార్' నాయకుల భేటీ


మంత్రిని సత్కరిస్తున్న మద్యం బార్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం): మద్యం బార్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నెల్లూరు నగర బార్ (మద్యం) అసోసియేషన్ నాయకులు మంత్రి నారాయణను కోరారు. 'బార్' అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, వీనస్ బార్ అధినేత షేక్ కాలేషా, మరికొందరు మంత్రిని ఆదివారం ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. సమస్యలు విన్నవించారు. వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు.

వైసీపీ దాడులకు జగన్ క్షమాపణ చెప్పాలి

● టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : దళితులపై వైసీపీ నాయకులు, రౌడీల దాడులకు బాధ్యత వహిస్తూ ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో వైసీపీకి చెందిన భూమన కరుణాకరరెడ్డి, ఆయన అనుచరులు ఒక దళిత యువకుడిని నిర్బంధించి హింసించారన్నారు. అమానుషంగా కొట్టడమే కాకుండా అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని చెప్పారు.

స్థల యజమానిపై దాడి.. వైసీపీ కార్పొరేటర్‌పై కేసు

నెల్లూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వైసీపీకి చెందిన ఓ కార్పొరేటర్‌పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు... నగరంలోని ఆకుతోట ప్రాంతంలోని షిరిడీసాయి లేఅవుట్‌లో బద్వేల్ మోహన్ అనే వ్యక్తికి రెండు ప్లాట్లు ఉన్నాయి. ఆయన వాటిని చూసేందుకు వెళ్లగా వాటికి ఇనుప వైర్లతో ఫెన్సింగ్ వేసి ఉంది. అది ఎవరు వేశారని చుట్టుపక్కల వారిని అడగ్గా స్థానిక కార్పొరేటర్ సుధాకర్ వేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మోహన్ కార్పొరేటర్ సుధాకర్‌కి ఫోన్ చేసి ప్రశ్నించారు. దీంతో ఆయన అక్కడకు చేరుకుని మోహన్‌పై దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాట్ల పత్రాలు చూపినా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా భయన చిరంజీవి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టు వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాలను తెలియ జేశారు. ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

విడవలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) ముదివర్తి గ్రామంలోని రక్షణ సైన్యం ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నారెడ్డిపాళానికి చెందిన 23 గిరిజన కుటుంబాలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దైవ ప్రబోధకులు జోసఫ్, సుశీల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రక్షణ సైన్యం సభ్యులు గుమ్మడి రత్నం, విజయకుమార్, చిన్నిబాబు, నన్నం నిరంజన్, నిలిమా, నాగరాజు, రాంబాబు, రవితేజ పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు ఏపీ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మస్తాన్‌స్వామిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించారు. మరికొందరు భక్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దర్గాను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాపూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాపూరు మండల పరిషత్ అధికారిణి మారెళ్ల భవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసులకు మోటారు దొంగల సవాల్

విడవలూరులో ట్రాన్స్‌ఫార్మర్, దంపూరులో మోటారు వైర్ల చోరీ

విడవలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్లను చోరీ చేస్తున్న ఘటనలు మండలంలో రోజురోజుకూ పెరిగిపో తున్నాయి. స్థానిక పోలీసులు ఎంత నిఘా పెట్టినా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. వారం రోజుల క్రితం గాదెలదిన్నె గ్రామంలో 3 మోటార్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. తాజాగా గురు, శుక్ర, శనివారాల్లో వరుసగా వేకువజామున దంపూ రుకు చెందిన అత్తిపాటి శీనయ్య, జి. అశోక్, వెంకటేశ్వర్లుకు చెందిన పొలాల్లో మూడు మోటార్లను పగులగొట్టి కాపర్ వైర్లను తీసుకెళ్లి పోయారు. ఇదిలా ఉండగా విడవలూరు పంచా యతీ మన్మధరావు పేట-ముదివర్తి మార్గంలో ఉన్న పొలాల్లో ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్ ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, కాపర్ వైరు చోరీ చేశారు. దీంతో బాధిత రైతులు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలో వారం రోజుల వ్యవధిలోనే 6 మోటార్లు, ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయటంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.


దంపూరులో మోటారును ధ్వంసం చేసి రాగి తీగను తీసుకెళ్లిన దొంగలు

● **శివారు ప్రాంతాల్లోనే...**

మండలంలో జన సంచారంలేని శివారు ప్రాంతాలను దొంగలు లక్ష్యంగా చేసుకుని మోటార్ల చోరీకి పాల్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గడిచిన వారం రోజుల్లో విడవలూరు, అల్లూరు మండలాల సరిహద్దులో ఉన్న జనసంచారం లేని పైడేరు డ్రెయిన్ కరకట్టలపై మోటార్లను పగులగొట్టి వైర్లను తీపుకెళ్లిపోయారు.. అదేవిదంగా విడవలూరు పంచాయతీ మన్మధరావు పేట-ముదివర్తి దారిలో సాయంత్రం అయితే జనసంచారం ఉండదు. ఇదే అదునుగా భావించిన దొంగలు దర్జాగా ట్రాన్స్ ఫార్మర్‌ని కిందకి దింపి ధ్వంసం చేశారు. స్థానిక పోలీసులు ఎంత నిఘా పెట్టినా.. ఫలితం లేకుండా పోతోంది. పైగా.. వరుస దొంగతనాలు చేస్తూ.. 'పట్టుకోండి చూద్దాం' అంటూ పోలీసు లకే దుండగులు సవాల్ విసుతున్నారు. కాపర్ తీగల చోరీలు ఇలాగే కొనసాగితే తీవ్ర స్థాయిలో పంటలను నష్టపోవాల్సివస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు ఎండిపోతున్నాయి



మోటార్ల ధ్వంసం, కాపర్ వైర్ల దొంగ తనాల వల్ల చాలా నష్టపోతున్నాం. తిరిగి ఏర్పాటు చేసుకోవాలంటే చాలా రోజులు పడుతుంది. ఈలోగా పంటలు ఎండిపోతు న్నాయి. విడవ లూరు, అల్లూరు పోలీసులు సమన్వయంతో పని చేసి దొంగతనాలను అరికట్టాలి.
- సురేంద్రరెడ్డి, దంపూరు గ్రామ సర్పంచ్

మోటారు దొంగతనాలను అరికడతాం:

మోటారు దొంగతనాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఫిర్యాదులు వచ్చాయి. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం.
నరేష్‌కుమార్ యాదవ్, ఎస్ఐ విడవలూరు

బోనం అందుకున్న గంగమ్మ తల్లి

పోతురాజుల వీరంగం, భక్తుల పూనకాలతో సరికొత్త శోభ

బోనాలు సమర్పించి.. మొక్కులు తీర్చుకున్న భక్తులు


బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పొదలకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీగంగమ్మ కొలుపు మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. పొదలకూరులోని గంగమ్మ తల్లి బోనాలు అందుకున్నారు. డప్పుచప్పుళ్లు, తీన్మార్ స్టెప్పులతో పట్టణం మారుమోగింది. పోతురాజుల వీరంగం, భక్తుల పూనకాలతో పొదలకూరు సరికొత్త శోభను సంతరించుకుంది. కొలుపు మహోత్సవంలో భాగంగా మూడో రోజు ఆదివారం బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు, అనుకోని విపత్తుల నుంచి రక్షించమని గంగమ్మ తల్లికి మొక్కుకుని బోనం సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్ల మద్దిరిళ్ల నరసింహులు యాదవ్, చైర్మన్ వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు పడ్డాల వేమయ్య, సెక్రటరీ కుమార్, ట్రెజరర్ శ్రీధర్, యరగర్ల జయరామయ్య, అన్నదానపు కృష్ణయ్య, గోమసాని వేణు, వెడిచర్ల మురళీ, పీపీఎస్ ప్రసాద్‌యాదవ్, గోళ్ల పద్మనాభం, కండే వాసు, పడ్డాల రాము, మద్దిరిళ్ల పెంచలస్వామి, రాజేష్, భాస్కర్, వాకా శివ, కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముత్తుకూరులో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి


బహుమతులు అందజేస్తున్న మల్లికార్జున యాదవ్

ముత్తుకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో ముత్తుకూరులో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఆదివారం రాష్ట్ర టీ10 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసి యేషన్ నిర్వహించిన అంతర్రాష్ట్రీయ క్రికెట్ పో టీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పిల్లలకు క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికో ల్లాసాన్ని కలిగిస్తాయ న్నారు. కృష్ణపట్నం అదానీ పోర్టు సహకారంతో సుందర క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఈ ప్రాంగణంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు జరిగేలా అన్ని వసతులు కల్పించి, అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల క్రికెట్ పోటీలలో నెల్లూరు జిల్లా జట్టు విజ యం సాధించింది. విజేతలకు మల్లికా ర్జున యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు ప్రభాకర్ గౌడ్, గణేష్, శ్రీనివాసరావు, మండల టీడీపీ నాయకులు అక్కయ్యగారి ఏడుకొండలు, బొలి గర్ల శ్రీనివాసులు, నడవడి ముత్యం గౌడ్, గుంజి శ్రీనివాసులు, శంకర్, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నెల్లూరు పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ బుచ్చి రూరల్ అధ్యక్షుడు సిద్దన మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బుచ్చిలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సారథ్యం పేరుతో పార్టీని ముందుకు తీసుకెళ్ళడంలో భాగంగా నెల్లూరులో పర్యటిస్తున్నారన్నారు. నెల్లూరులో చాయ్‌పే చర్చ, ర్యాలీలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

స్థానిక ఎన్నికల్లోగా 'జనసేన'ను బలోపేతం చేయాలి

మనుబోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక ఎన్నికల్లోగా జనసేన పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని జనసేన పార్టీ సర్వేపల్లి ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. ఆదివారం మనుబోలులో ఆత్మీయ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని 19 పంచాయతీల్లో ఉన్న జన సైనికులు హాజరయ్యారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ వాణిభవాని నాయుడు,మండల కార్యదర్శి ఖాదర్ వల్లీ, సాగునీటి సంఘం సభ్యులు పెనుబాక మహేష్, జనసైనికులు జాకీర్, సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో
విడవలూరు నేతలు

విడవలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివేందుల్లో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి కి మద్దత్తుగా విడవలూరుకి చెందిన ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చలంచర్ల కామేశ్వరమ్మ, కార్యకర్తలు నల్లగుండు వారి పల్లెలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థితో కలసి గడపగడపకి తిరుగుతూ అధికారంలోనికి వచ్చిన 12నెలల కాలంలో టీడీపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

అల్లుకు పోతాం... అడిగేదెవరు...?



పెనుబల్లి శివారులోని రైస్ మిల్లు సమీపంలో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు



బుచ్చి జొన్నవాడ ప్రధాన మార్గంలో కానుగ చెట్లు కాలనీ వద్ద విద్యుత్ తీగలకు అల్లుకుపోయిన చెట్లు

కరెంటు తీగలపైన అల్లుకుంటున్న తీగలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దొండ, తిప్పతీగలు అల్లుకు పోయాయి.అయినా విద్యుత్ శాఖాధికారులు తొలగించకపోవడంతో.. 'అల్లుకుపోతాం అడిగేదెవరు..' అన్న చందంగా పరిస్థితి తయారైంది. దీంతో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. ప్రధానంగా బుచ్చి, జొన్నవాడ, నెల్లూరు ప్రధాన మార్గాలు, గ్రామాలు, పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుపోయాయి. మనుషులు, మూగ జీవాలకు ప్రాణాపాయం వాటిల్లక ముందే.. వీటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

బ్యారేజ్ ఫుట్‌పాత్‌పై నడిచేదెట్లా...



సంగం బ్యారేజ్ వంతెన ఫుట్‌పాత్‌పై కాంక్రీట్ బండలు వేయక పోవడంతో నీరునిలిచి పాదచారుల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. సంగం బ్యారేజీ డిజైన్‌లో వంతెనకు రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించాలి. కానీ కాంట్రాక్టర్ వంతెన పడమర వైపు ఒక పక్క ఫుట్‌పాత్‌కు కాంక్రీట్ బండలు వేసి తూర్పు వైపు వేయకుండా వదిలేశారు. దీంతో కాంక్రీట్ బండలు వేయని ఫుట్‌పాత్‌లో వర్షపునీరు నిలిచి బ్యారేజీపై ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారికి అసౌకర్యంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి ఫుట్‌పాత్‌పై కాంక్రీట్ బండలు వేయించి వాకింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

ఈ దారిలో నడిచేదెలా సారూ..?



స్థానిక బస్టాండ్ సమీపంలోని కెనరా బ్యాంకు వద్ద రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పెద్దగుంత ఏర్పడగా ఇటీవల కంకర మిశ్రమంతో అధికారులు పూడ్చి పనులు చేయించారు. అయినా రోడ్డుపై వర్షపునీరు నిలిచి ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని, పూర్తిస్థాయి మరమ్మతు పనులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

ఆర్ఐఎంసీకి సంగం విద్యార్థి ఎంపిక

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురం గ్రామానికి చెందిన డేగా మనోహర్‌రెడ్డి కుమారుడు డేగా చంద్రిల్‌రెడ్డి ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ సైనిక కళాశాల ఆర్ఐఎంసీ (రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజి)కు ఎంపికయ్యాడు. ఈమేరకు ఆదివారం రాత్రి విద్యార్థికి ఆర్ఐఎంసీ నుంచి సమాచారం అందింది. వివరాల మేరకు... దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఉన్న రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి 8వ తరగతిలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తుంది. 2024 డిసెంబరులో రాష్ట్ర స్థాయిలో జరిగిన పరీక్షల్లో సిద్దీపురం గ్రామానికి చెందిన డేగా చంద్రిల్ రెడ్డి ఎంపికయ్యాడు. ఈనెల 19న కళాశాలలో అడ్మిషన్ పొందాలని ఆదివారం కాల్ లెటర్ పంపారు. దీంతో విద్యార్థిని పలువురు అభినందించారు.



డేగా చంద్రిల్‌రెడ్డి

బాలల ఆరోగ్యానికి భద్రత అవసరం..?

- ఆరోగ్య సమస్యలతో పేద పిల్లలు సతమతం
- గతేడాది వైద్య పరీక్షల్లో 745 మంది గుర్తింపు
- వారిలో గ్రహణ మొర్రి, వంకర కాళ్ల బాధితులు
- త్వరలో మరోసారి ఆర్‌బీఎస్‌కే!

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నేటి బాలలే రేపటి పౌరులు. వారు ఆరోగ్యంగా ఉంటే రేపటి సమాజం కూడా ఆరోగ్యవంతంగా తయారవుతుంది. అయితే పేద కుటుంబాల్లోని ఎంతో మంది చిన్నారులు ఆరోగ్య సమస్య లతో బాధపడుతున్నారు. జన్యుపరమైన సమస్యలతో కొందరు ఇబ్బంది పడుతుంటే మరికొందరు తల్లిదం డ్రుల అవగాహన లోపంతో అనారోగ్యం పాలవుతు న్నారు. రాష్ట్రీయ బాలసురక్ష కార్యక్రమం (ఆర్‌బీ ఎస్‌కే) పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీల్లో గతేడాది ప్రభుత్వం నిర్వ హించిన వైద్య పరీక్షల్లో ఈ విషయం వెల్లడైంది. పలువురు చిన్నారులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తిం చారు. త్వరలో మరోసారి ఆర్‌బీ ఎస్‌కే నిర్వహించ నున్న నేపథ్యంలో భావి భారత పౌరుల ఆరోగ్యానికి మరింత మెరుగైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

పాఠశాలలు, అంగన్‌వాడీల్లో..

జిల్లాలో మొత్తం 2594 ప్రభుత్వ పాఠశాలలు, 2933 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,84,210 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అంగన్‌వాడీల్లో 1,32,703 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో పలువురికి ఆరోగ్య సమ స్యలు ఉన్నట్లు గతేడాది పరీక్షల్లో ప్రభుత్వం గుర్తించింది. ప్రధానంగా మేనరిక వివాహం చేసుకున్న వారికి జన్మించిన పిల్లల్లో కొన్ని సమ స్యలను వైద్యులు గుర్తించారు. జన్యుపరమైన లోపాలతో పాటు తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోక పోవటంతో పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలా దీర్ఘకాలిక సమస్యలు ఉన్న విద్యార్థులను జిల్లా ఆసుపత్రికి పంపించారు. ఇతర సమస్యలు ఉంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందించారు.

745 మంది గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా గతేడాది నిర్వహించిన వైద్య పరీక్షల్లో 745 మంది చిన్నారులకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 115 మంది గ్రహణ మొర్రి, కాళ్ల, చేతులు వంకర పోవటం, వెన్నుపూస సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు వారికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న బాలభవిత కేంద్రం ద్వారా చికిత్సలు అందించారు. అలాగే 630 మంది చిన్నారుల్లో వయసుకు తగ్గ పురోగతి లేకపోవటం, సరిగ్గా మాట్లాడక పోవటం, స్వతంతగా పనులు చేయలేకపోవటం, చదువుపై శ్రద్ధ చూపకపోవటం, దృష్టి సమస్యలు, పుట్టుకతో లోపాలు, దంత సమస్యలు వంటివి గుర్తించి చికిత్సలు అందించారు. సకాలంలో టీకాలు వేయించకపోవటం, పౌష్టికాహార లోపం వంటి సమస్యలను గుర్తించి చికిత్సలు అందించారు.

వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలలో చిన్నారులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ఆయా పాఠశాలల్లో చిన్నారుల ఆరోగ్య సమస్యలు గుర్తించి వైద్య చికిత్సలు అందచేస్తున్నాం. తల్లి దండ్రులకు విద్యార్థి అనారోగ్య పరిస్థితు లు తెలియచేసి వారి ఆరోగ్యం మెరుగుపడేలా కృషి చేస్తున్నాం.

- డాక్టర్ యశ్వంత్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త

48 మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాళెం మలుపు వద్ద అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణంపై ఆదివారం ఉదయ గిరి సీఐ వెంకటరావు, ఎస్ఐ ఆదిలక్ష్మీ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 48 మద్యం సీసాలతో పాటు దుకాణ నిర్వాహకుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పాము కాటుకు మహిళ మృతి



మృతిచెందిన రామమ్మ

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెంలో గ్రామానికి చెందిన పాకం రామమ్మ (40) అనే మహిళ నాగుపాము కాటుకు గురై ఆదివారం మృతి చెందింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పాకం రామమ్మ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఇటీవల ఇంటికి తాళం వేసి బుచ్చిరెడ్డిపాళెంలో ఓ ఇంట్లో వంటపని చేస్తూ అక్కడే ఉంటోంది. ఆదివారం సొంత ఇంటికి వచ్చి శుభ్రం చేస్తుండగా ఇంట్లో సామాన్ల చాటున ఉన్న నాగుపాము కాటువేసింది. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. నాగుపామును స్థానికులు చంపివేశారు.

గిరిజనుల ఉన్నతి కోసం జేఏసీ

- కన్వీనర్ రవి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులను ఉన్నతస్థాయికి చేర్చడమే లక్ష్యంగా గిరిజన సంఘాల జేఏసీని ఏర్పాటు చేశామని ఆ జేఏసీ కన్వీనర్ పాలకీర్తి రవి అన్నారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రవి మాట్లాడుతూ త్వరలో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పా రు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి పలు అంశాలపై గిరిజనులకు అవగా హన కల్పి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ మస్తాన్, ఉపాధ్యక్షుడు సముద్రాల దావీదు, మహిళా అధ్యక్షురాలు చల్లా మాధ వి, వీ చిన్నబ్బాయి, మోర్ల శివ, పులింద్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తల్లిదండ్రుల ఆందోళన

నెల్లూరు(క్రైం) ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాచపాలెం గ్రామానికి చెందిన పీ. తిరుమలయ్య, వేదవతి కుమార్తె హేమశ్రీ(16). ఆమె ఈ ఏడాది జూన్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చేరింది. హాస్టల్‌లోనే ఉండి చదువుకుంటోంది. కొంతకాలంగా చదువుల్లో ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని, మరో సెక్షన్‌కు మార్చాలని కళాశాల సిబ్బందిని అడుగుతూ ఉండేది. ఈ క్రమంలో ఈనెల 9న రాత్రి హేమశ్రీ తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తాను చాలా ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. ఆదివారం ఉదయం కూడా తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసింది. ఏం జరిగిందోఏమో హేమశ్రీ అనారోగ్యానికి గురవడంతో సమీపంలోని వైద్యశాలలో చేర్పించామని, పరిస్థితి విషమయంగా ఉందని హస్టల్ సిబ్బంది ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పారు. వారు హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని చూడగా కుమార్తె చనిపోయింది. దీంతో బాధిత తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు కళాశాల వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని పరిశీలించారు. ఆ ప్రాంతం వేదాయపాలెం స్టేషన్ కావడంతో వారికి సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు కళాశాల వద్దకు చేరుకుని విచారించారు.



హేమశ్రీ (ఫైల్)

ఇంటర్నేషనల్ కరాటే పోటీలో బంగారు పతకం

కలిగిరి, ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): మండలంలోని బసిరెడ్డిపాలెంకు చెందిన బోరెడ్డి సరిత తంజావూరులో శని, ఆదివారాల్లో జరిగిన 3వ ఇంటర్‌నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. పెరియార్ మణి ఎంఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాల ఆవరణలో కింగ్‌షిటో రియూస్పోర్ట్స్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో బంగారు పతకం సాధించిన సరిత నేషనల్ కరాటే ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, సినీనటుడు సుమన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ పియూష్ జైన్ చేతుల మీదుగా బంగారు పతకం, ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకుంది. ఈ సందర్భంగా తనకు కరాటేలో శిక్షణ ఇచ్చి బంగారు పతకం సాధించటానికి కారుకులైన కరాటే మాస్టార్లు లక్ష్మీసామ్రాజ్యం, రవిలకు సరిత కృతజ్ఞతలు తెలిపారు.



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా ట్రోఫీ, బంగారు పతకం అందుకుంటున్న సరిత

పేకాట రాయుళ్ల అరెస్టు

విడవలూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ముదివర్తి గ్రామ సమీపంలోని పెన్నా పరీవాహక ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం స్థానిక ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ అదుపులోకి తీసుకున్నారు. పెన్నాతీరంలో పేకాట జోరుగా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. నలుగురిని అరెస్టు చేసి, వారివద్ద నుంచి రూ. 4 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

మైనింగ్ అనుమతులు రద్దుచేయాలి

- ఆలయం, చర్చిల్లో ఆందోళనకారుల పూజలు, ప్రార్థనలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్లరాయి) తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ ఆదివారం వరికుంటపాడులోని రామాలయం వీధిలో ఉన్న నాగార్పమ్మ ఆలయంలో ఆందోళనకారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వరికుంటపాడు, కనియంపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రజలతో సహా గ్రామాలను సర్వనాశనం చేసే మైనింగ్ అనుమతులను రద్దుచేయాలని అధికారులు, రాజకీయ నాయకులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మైనింగ్ అనుమతులకు వ్యతిరేకంగా తాము సాగిస్తున్న పోరా టాలు ఫలించేలా మమ్మల్ని ఆశీర్వదించి కాపాడాలంటూ అమ్మవారితో సహా ఏసు క్రీస్తును వేడుకున్నారు. కాగా, ఆ సమయంలో చర్చిల వద్ద పోలీసులు మఫ్టీలో నిఘా ఉండడంతో అసహనానికి గురైన ఆందోళనకారులు శాంతియుతంగా ప్రార్థనలు చేసుకొనే స్వేచ్ఛ కూడా తమకు లేదా అంటూ మండిపడ్డారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆందోళనకారులు

ప్రాణం తీసిన చేపల వేట!

- సుడిగుండంలో చిక్కుకుని ఇద్దరు యువకుల మృతి
- ఒకరిని రక్షించిన మెరైన్ పోలీసులు
- తుమ్మలపెంట పల్లెపాలెం మత్స్యకార కుటుంబాల్లో విషాదం
- మృతుల కుటుంబాలకు కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పరామర్శ

కావలిరూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చేపల వేట ఇద్దరి యువకుల ప్రాణం తీసింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం కావలి మండలం తుమ్మలపెంట సముద్రతీరంలో జరిగింది. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. తుమ్మలపెంట పల్లెపాలెంకు చెందిన శ్రీహరి, వెంకటేశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వారి రెండోవ కుమారుడు వెయ్యల విష్ణు(19), శ్రీను, సావిత్రమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా వారి రెండోవ కుమారుడు ఐలా శివకృష్ణ(20), అదే ప్రాంతానికి చెందిన నాంచారయ్యలు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో విష్ణు, శివకృష్ణలు నీటి సుడిగుండంలో చిక్కుకోగా వారికి కొంత దూరంలో ఉన్న నాంచారయ్య నీటిలో కొట్టుకుపోతూ కేకలు వేశాడు. గమనించిన మెరైన్ పోలీసులు నాంచారయ్యను కాపాడి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే నీట మునిగి అపస్మారక స్థితిలో ఉన్న విష్ణు, శివకృష్ణలను సైతం ఒడ్డుకు చేర్చి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాజిబాబులు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే ప్రాంతానికి చెందిన చిన్నమ్మ, పెద్దమ్మ కుమారులైన విష్ణు, శివకృష్ణల మృతితో గ్రామంలో విషాధం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా సమాచారం అందుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఏరియా వైద్యశాలకు చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ముగ్గురిలో ఇద్దరు యువకుల మృతి చెందటం బాధాకరమని, ఇదొక దురదృష్టకరమైన ఘటన అన్నారు. బోటు లేకుండా తీరం వెంట వేట సాగించడమే ప్రమాదానికి కారణమైంద న్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని మృతుల కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.



మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



వెయ్యల విష్ణు, ఐలా శివకృష్ణ (ఫైల్)

పనిచేయని చేతిపంపు పర్యాటకుల అవస్థలు

ఉదయగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గం కొండపై గల జటపటబీ దర్గా ఆవరణలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం నెల్లూరు, కావలి ప్రాంతాల నుంచే కాకుండా ఉదయగిరి పట్టణానికి చెందిన పలువురు దుర్గం సందర్శనకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో దర్గా ఆవరణలో భోజనాలు చేసేందుకు ప్రయత్నించగా అక్కడున్న చేతిపంపులో నీరు రాకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. చేతిపంపు ఐదారు నెలలుగా పని చేయడంలేదని, త్వరలో దర్గా గంధ మహోత్సంతోపాటు దుర్గంపై వనభోజన కార్యక్రమాలు ఉన్నాయని, అధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన చేతిపంపు

దేవాంగ సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘానికి అధ్యక్షుడిగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా వార్త రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న హెచ్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ఆ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ అధికారిగా పముజుల నాగేశ్వరరావు, సహాయ ప్రిసైడింగ్ అధికారిగా గౌరబత్తిన హజరత్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సజ్జా సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి చెప్పరం మల్లికార్జున, గౌరవ అధ్యక్షుడు కర్ణ రాఘవరావు, కన్నా మధుసూదన్‌రావు, జాగాబత్తిన సైలేష్ పాల్గొన్నారు.



దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గానికి ఎంపికైనవారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

మనుబోలు, ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): స్థానిక కోదండరామపురంలోని అరుంధతి వాడ వద్ద పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం ఎస్ఐ. శివరాకేష్ దాడులు నిర్వహించారు. సిబ్బందితో మఫ్టీలో వెళ్లి నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారివద్దనుంచీ రూ. 4200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పట్టుబడిన పేకాట రాయుళ్లతో పోలీసులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 505

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9728
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ.121.60

'జనార్దనస్వామి' పాలకమండలికి దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని స్కంధపురి జనార్దనస్వామి ఆలయ నూతన పాలకవర్గం (ధర్మకర్తల మండలి) నియామకం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినందున ఆసక్తి కలిగిన భక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో బైరాగిచౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 20 రోజుల లోపు ఆలయ కార్యాలయంలో అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారితో నూతన పాలకవర్గంను ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

క్షణ.. క్షణం..

భయం.. భయం!

● శిథిలావస్థలో కలిగిరి పోలీసు స్టేషన్ భవనం ● ఏ క్షణమైనా కూలవచ్చని ఆందోళన



కలిగిరి పోలీస్‌స్టేషన్

కలిగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన పోలీసు స్టేషన్ భవనం ఏ క్షణమైన కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఇక్కడ విధులు నిర్వహించే పోలీసులు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు క్షణ క్షణం భయంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగినా, సమస్యలు వచ్చినా తమకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తుకొస్తారు. ఇలా ప్రజల కష్టాలు తీర్చే పోలీసులకు పెద్ద కష్టం వచ్చింది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు తాము విధులు నిర్వహిస్తున్న కార్యాలయ భవనం ఏ క్షణం కూలిపోతుందో తమ ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో అనే భయాందోళనలతో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కావలి డీఎస్పీ శ్రీధర్ కలిగిరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినప్పుడు శిథిలమైన భవనాన్ని గమనించి సిబ్బంది విధులు ఎలా నిర్వహిస్తున్నారని అన్నారంటే భవనం పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. కలిగిరి పోలీస్‌స్టేషన్‌ను 1969లో నిర్మించారు. 56 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భవనం గోడలు బీటలువారాయి. పైకప్పు పెచ్చులూడి పడుతుంది.

● వర్షం వస్తే కార్యాలయం మడుగే..

ప్రధాన రహదారి పక్కన లోతట్టు ప్రాంతంలో పోలీస్ స్టేషన్ ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయంలోకి వర్షపునీరు వచ్చి మడుగులా చేరుతోంది. ఆ నీటిని తోడి పోయాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వర్షాకాలమంతా గోడలునాని నెమ్ముగా ఉండటంతో గోడలకు కరెంటు సరఫరా అవుతోంది. వర్షాకాలం సమయంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది హడలిపోతున్నారు. కాగా కలిగిరి పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్మాణాలకు 2021లో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పట్టణం సమీపంలోని జిర్రావారిపాలెం వద్ద స్థలాన్ని పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం చేస్తామన్న అధికారుల మాటలు నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో పాతభవనంలోనే బిక్కుబిక్కుమంటూ పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ ఉమా శంకర్ మాట్లాడుతూ భవనం శిథిలావస్థలో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వర్షాకాలంలో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నాం. నూతన భవనం నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



పెచ్చులూడిన శ్లాబు



ఇటీవల వర్షం కురిసినప్పుడు స్టేషన్‌లో నిలిచిన నీరు

ఏపీఆర్ఎస్ఏ కావలి డివిజన్
యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన ఏపీఆర్ఎస్ఏ కావలి డివిజన్ యూనిట్ నూతన కార్యవర్గం

కావలి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కావలి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) కావలి డివిజన్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికల అధికారులు పీ.హేమంత్‌కుమార్, కే శ్రీనివాసులు పర్యవేక్షణలో జిల్లా అసోసియేషన్ నాయకులు యూ.లక్ష్మి, పీ.నరసారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో కావలి డివిజన్ యూనిట్ అధ్యక్షుడిగా కావలి తహసీల్దారు పీ.శ్రావన్‌కుమార్, కార్యదర్శిగా కావలి ఉపతహసీల్దార్ వీవీ మురళీధర్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దగదర్తి తహసీల్దారు పీ.కృష్ణ, ఉపాధ్యక్షులుగా కలిగిరి, అల్లూరు, విడవలూరు ఆర్ఐలు బీ.లీలాసుజీ, ఎస్.ప్రభుదీప్, ఎండీ అబ్దుల్ సలామ్‌లు ఎన్నికయ్యారు. కోశాధికారిగా బోగోలు ఉపతహసీల్దారు కే.భరత్, జాయింట్ కార్యదర్శులుగా కే.కనకాద్రి, ఏవీవీ ప్రసాద్‌రావు, ఎస్‌డీ గులాంలు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రాజేంద్ర ప్రసాద్, బీ.స్వప్న, జే.మొనాలినీ థెరిస్సా, జిల్లా కౌన్సిలర్లుగా పీ.ఇమ్రాన్‌ఖాన్, ఎం.యానాది తిరుపతయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాని జిల్లా అసోసియేషన్ నాయకులు అభినందించారు.

వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌పై సదస్సు



డాక్టరు సురేంద్రలోయను సత్కరిస్తున్న కరస్పాండెంట్, తదితరులు

కందుకూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మానవ రహిత వైమానిక వాహనం యాంటెన్నా డిజైన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌పై ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. అకడమెషియన్, పరిశోధకుడు డాక్టరు సురేంద్రలోయ ప్రధాన అతిథిగా పాల్గొని యూఏవీ యాంటెన్నాల రూపకల్పన, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సాంకేతికతలపై విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ డాక్టరు కె.విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాలు రాబోయే ఒకటిరెండేళ్లలో సైన్స్ ఇంజనీరింగ్ విభాగాన్ని మించిపోతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశోధకుడు డాక్టరు సురేంద్రను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ప్రొఫెసర్లు గద్దె సురేష్, హనుమంతరావు, రామకోటేశ్వరరావు, శ్రీకాంత్, మాధవరావు, మస్తాన్‌వలి, శ్రీహరి, రవి పాల్గొన్నారు.

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

లింగసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈనెల 12వ తేదీన ఏడాది వయస్సు దాటిన చిన్నారుల నుంచి 18 ఏళ్ల వయస్సు లోపు విద్యార్థు లకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పీ.విద్యావతి చెప్పారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. మండలంలోని 45 అంగన్వాడీ కేంద్రాల్లోని 1450 మంది చిన్నారులకు, 46 ప్రభుత్వ, 5 ప్రైవేటు పాఠశాలల్లోని 4374 మందికి 12, 20వ తేదీలలో ఆల్బెండాజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. సీహెచ్‌వో జీ.శ్రీనివాసులు, పాల్గొన్నారు.

● **కొండాపురం(ఆంధ్రజ్యోతి):** అనీమియాను నివారించేందుకు 18 ఏళ్ల లోపు పిల్లలకు ఏడాదిలో రెండుసార్లు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నసీరుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 5637 మందికి ఈనెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మాత్రలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రసన్నుడి పుష్కరిణి నిర్మాణం పూర్వజన్మ సుకృతం

● రూ.2.10 కోట్ల వితరణ చేసిన వేమిరెడ్డి దంపతులు ● కోనేరు, మహాప్రాకారం నిర్మాణాలకు శంకుస్థాపన



పుష్కరిణి పునఃనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, కోవూరు, కావలి ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి

బిట్రగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసి ఉన్న కలియుగ దైవం ప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్కరిణి తమ ద్వారా నిర్మాణం జరగనుండడం పూర్వజన్మ సుకృతమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఈ పుష్కరణి నిర్మాణానికి రూ.2.10 కోట్ల విరాళం ఇచ్చిన వేమిరెడ్డి దంపతులు ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలసి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. దీంతోపాటు మొదట దేవాదాయశాఖ మంజూరు చేసిన రూ.1.65 కోట్లతో మహాప్రాకార నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు, కావలి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సతీమణి బీద జ్యోతిలకు ఈవో రాధాకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపుతో బిలకూట క్షేత్రం దిగి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే ఆలయ అభివృద్ధికి రూ.15 కోట్లు తీసుకురావడం ఎమ్మెల్యే కృషికి నిదర్శనం అన్నారు. 800 ఏళ్ల చరిత్రగల ఈ ఆలయ అభివృద్ధిలో పాలి భాగస్వాములం కావడం అదృష్టమన్నారు. కోనేటి నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శించుకోవాలని ఎన్నోసార్లు అనుకున్నా, కానీ ఆయనకు సేవలందించేలా కోనేటి శంకుస్థాపన కార్యక్రమంతో దర్శించుకునే భాగ్యం లభించిందన్నారు. టీటీడీ ఛైర్మన్, ఈవో, ఇతర సభ్యులతో మాట్లాడి వేదపాఠశాల ఏర్పాటు విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతు వేమిరెడ్డి దంపతులు ఆలయ అభివృద్ధికి ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమన్నారు. స్వామివారి కల్యాణ మండపం ఏర్పాటు సంకల్పనతో కొందరు దాతలను కలిశానని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఆలయ ప్రధాన అర్చకులు ఈపూరి సత్యనారాయణ చార్యులు, కావలి ఏఎంసీ ఛైర్మన్ అలేఖ్య, బీద గిరిధర్, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నేతలు విజయ్‌కుమార్, బీజేపీ నేతలు ఎస్ఎస్ యాదవ్, శ్రీనివాసులు యాదవ్, కే.బ్రహ్మానందం, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయం ఎదుట పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ 51 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న ఏకైక సంఘమన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాయబ్, ఖాదర్‌బాషా, ఫణిరాజ్, మున్నా, సుబ్బారెడ్డి, చెంచయ్య, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సారథ్య కార్యక్రమం విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న మండల బీజేపీ నాయకులు

సీతారామపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న సారథ్యం కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదివారం స్థానిక బిజెపి నాయకులు పిలుపు నిచ్చారు. మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభి మానులు అధిక సంఖ్యలో పాల్గొ ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌సాయి సందీప్, కార్యదర్శి కాశిరావు, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు చెన్నుబోయిన నరసింహులు, రేనాటి వెంకటేశ్వర్లు, కుర్చేటి బ్రహ్మయ్య, వెంకటయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజారెడ్డి

ఏఎస్ పేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీపీ పద్మజారెడ్డి సూచించారు. ఆదివారం ఆమె ఎంపీడీవో ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె సమావేశానికి పలు శాఖల అధికారులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులే గైర్హాజరు అయితే అభివృద్ధి గురించి ఎవరితో చర్చించాలని అన్నారు. అనంతరం నులి పురుగుల నివారణ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను చిరమన పీహెచ్‌సీ వైద్యులు జ్యోతిరాణితో కలిసి ఆవిష్కరించారు. తదనంతరం పలు శాఖలపై సమీక్షించారు. డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ధ్యాన సాధన చేయాలి

వింజమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధ్యాన సాధన చేయాలని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ నరసింహారావు అన్నారు. వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యానంపై అవగాహన కల్పించారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యత గురించి వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమలత, పద్మ, స్వప్న, రవిచంద్ర, జానకిరామిరెడ్డి, అంకిరెడ్డి, 40 మంది ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రెవెన్యూ డివిజనల్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రెవెన్యూ డివిజన్ నూతన కార్యవర్గం

ఆత్మకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ కార్యవర్గం ఎన్నిక ఆత్మకూరులో ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. రెవెన్యూ డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఉదయగిరి తహసీల్దారు ఎల్ రామ్మోహన్, కార్యదర్శిగా ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దారు డి శాంతిస్వరూప్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏఎస్‌పేట డిప్యూటీ తహసీల్దారు జి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సంధ్య ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా ఎండి గయాజ్, జి సతీష్‌కుమార్, శేషయ్య వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం నూతనంగా ఎన్నికైన 15మంది కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమంలో నెల్లూరు జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అల్లంపాటి పెంచలరెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మిగిలిన కార్యవర్గ అసోసియేషన్ ఎన్నికలు పూర్తయిన తరువాత జిల్లా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తా మన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై తాము నిరంతరం పోరాటం సాగిస్తామని తెలిపారు. ఆత్మకూరు డివిజన్ స్థాయిలో మొత్తం 73 మంది ఓటర్లు ఉండగా 15మంది కార్యవర్గ సభ్యులుగా పోటీచేసి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

గంగమ్మకు కిరీటం బహూకరణ



గంగమ్మకు బహూకరిస్తున్న కిరీటం

వింజమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమిట్ట వద్ద ఉన్న గంగాభవానీ అమ్మవారికి ఆదివారం హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది గుండ్లపల్లి మాల్యాద్రి యాదవ్ మకర తోరణం కిరీటాన్ని బహూకరించారు. అమ్మవారికి మొక్కుబడిలో భాగంగా సుమారు రూ. 2 లక్షల విలువ చేసే వస్తువులను అమ్మవారికి ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నరసింహులు



అనంతసాగరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా జడ పెంచల నరసింహులు ఎంపిక య్యారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డికి ధన్య వాదాలు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొస్తానని ఆయన తెలిపారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని గ్రామస్థుల ఆందోళన



శకునాలపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఉదయగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని ఆదివారం సీపీఎం ఉదయగిరి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తే వ్యతిరేకించిన ప్రస్తుత ప్రభుత్వం మరలా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఎలా ముందుకొస్తుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం మోపితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రూ.30 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పందిళ్ల వెంకటేశ్వర్లు, నాగరాజు, చిన రమణయ్య, వెంకటాద్రి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా మందిరంలో ఆత్మకూరు డివిజన్ కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సభ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పీహెచ్‌పి అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, డెంగ్యూ, అతిసార వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, ఆ వ్యాధులతో వచ్చిన వారికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల అనారోగ్య కారణాల వల్ల హైదరాబాదులో చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి పొందుతున్న నూతలపాటి శ్రీహరి బాబును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి శేషయ్య, ఎస్ ప్రసాదు, యు రామదాస్, పెంచలయ్య, డివిజన్ నాయకులు వెంకటేశ్వర్లు, జగన్మోహన్‌రావు, స్థానిక పీఎంపి వైద్యులు పాల్గొన్నారు.



శ్రీహరిబాబును పరామర్శిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

కాశీవిశ్వేశ్వరుని గ్రామోత్సవం



అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమనలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం అర్ధరాత్రి వైభవంగా ముగిసింది. ఈసందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ, అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో శ్రావణ మాసం మూడవ ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



శ్రీసిటీలో వేడుకగా తిరంగా ర్యాలీ

శ్రీసిటీలో ఆదివారం 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. ఈ ర్యాలీని ట్రిపుల్ ఐటీ మాజీ చైర్మన్, స్ఫాలినిటీ సంస్థ సీఈవో ఎం.బాలసుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సాయుధ దళాల ధైర్యం, త్యాగాలకు గౌరవ చిహ్నంగా 'ఐఐఐటీ-శ్రీసిటీ, క్రియా యూనివర్శిటీ, స్టేషన్- ఎస్, శ్రీసిటీ సంయుక్తంగా తిరంగా ర్యాలీ చేపట్టాయి. శ్రీసిటీ- ట్రిపుల్ రిజిస్ట్రార్ కల్నల్ ఉమాశంకర్, క్రియా యూనివర్శిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సీ.పీ.సత్యశరణ్, నోవా ఎయిర్‌టెల్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసులు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్, శ్రీసిటీలోని వెస్ట్‌ఫార్మా, ఆస్ట్రోటెక్ స్టీల్స్ వెర్మిరన్స్, జెన్ లెనిన్ సిద్ధార్థ లాజిస్టిక్స్, బ్లైండ్‌హబ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

- ఆగస్టు 15నుంచి అమలు
- రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా
- తిరుమలకు మాత్రం ఉచితం లేదు



ఫ్రీ బస్సు రెడీ

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ ఆర్ఎం జగదీష్

రాష్ట్ర ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఈనెల 15 తేదీ నుంచి శ్రీకారం చుట్టనున్న విషయం తెలిసిందే. ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. అయితే తిరుపతి - తిరుమల ప్రయాణానికి మాత్రం ఉచితం లేదని అధికారులు అంటున్నారు. రేషన్ కార్డు/ఓటర్ ఐడీ/ఆధార్ కార్డుల్లో ఏదో ఒకటి కండక్టర్‌కు చూపిస్తే చాలు. ఆయన 'జీరో' టికెట్ ఇస్తారు. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయడానికి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జగదీష్ 'ఆంధ్రజ్యోతి'తో సంభాషించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● సిబ్బందిని సమాయత్తం చేస్తున్నాం


ప్రభుత్వం, ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు వచ్చాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. సిబ్బందికి పలు దఫాలుగా అవగాహన కల్పిస్తున్నాం. బస్సుల కండిషన్స్ మెరుగుపరుస్తున్నాం. పూర్తిస్థాయిలో మరమ్మతులతో పాటు రంగులు వేస్తున్నాం. పాడైన బస్సులు అవకాశం ఉన్న వరకు సిద్ధం చేస్తున్నాం. ఆన్ కాల్ డ్రైవర్లను తీసుకోవడానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాం. కండక్టర్లకు ఓడీ (ఓవర్ డ్యూటీ) ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సిబ్బంది అవసరం కాబట్టి బస్టాండ్లలో, రిజర్వేషన్ కౌంటర్లు, అనౌన్స్‌మెంట్ ఇతర పనులకు ఉన్న కండక్టర్లను లైన్ మీదకు పంపే యోచనలో ఉన్నాం.

రీజనల్ పరిధిలో మొత్తం బస్సులు : 918

సొంత బస్సులు : 723, అద్దె బస్సులు : 195,
కొత్త బస్సులు : 65, డిపోలు: 11,
ఏ డిపోలో ఎన్ని బస్సులు : తిరుపతి 116, అలిపిరి 147, తిరుమల 99, మంగళం 97, శ్రీకాళహస్తి 108, పుత్తూరు 85, సత్యవేడు 55, గూడూరు 58, సూళ్లూరుపేట 38, వెంకటగిరి 62, వాకాడు 50
ప్రయాణికుల సంఖ్య : 2.25లక్షలు (రోజుకు),
రోజుకు బస్సులు తిరిగే కి.మీ : 3.39 లక్షలు,
ఆదాయం : రూ1.70 కోట్లు (రోజుకు),
ప్రస్తుతం మహిళలు ప్రయాణిస్తున్న శాతం : 40,
ఉచితం అమలైతే పెరిగే అంచనా : 63 శాతం.

● రద్దీ ప్రాంతాల్లో మరిన్ని బస్సులు

తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచానూరుకు అదనపు బస్సుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. పీక్ అవర్స్ రూట్స్ అయిన శ్రీకాళహస్తి, చిత్తూరు, సత్యవేడు, కాణిపాకం సర్వీసులు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మరిన్ని బస్సులు ఏర్పాటు చేయనున్నాం. అంతేగాకుండా గూడూరు, వాకాడు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో తిరిగే బడి బస్సులను కూడా ఖాళీ సమయంలో రోడ్డెక్కించనున్నాం. లాంగ్‌రూట్ బస్సులను ఖాళీగా ఉంచకుండా రద్దీ ప్రాంతాలకు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వారాంతం, పర్వదినాలు, సెలవులు రోజుల్లో ఓఆర్ (ఆక్యుపెన్సీ రేట్) తక్కువగా ఉన్న రూట్స్‌ను రద్దు చేసి రద్దీ ప్రాంతాలలో నడపనున్నాం. తిరుమలకు నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లకు, నాన్‌స్టాప్ బస్సులకు స్పష్టత లేదు. తిరుపతి-తిరుమల మధ్య ఉచిత ప్రయాణం ప్రస్తుతానికి లేదు. అధికారికంగా ప్రకటన వస్తే మరిన్ని మార్పులు జరగవచ్చు.



రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి దుర్మరణం

● మహిళ, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు



వెంకటరమణయ్య - కిరణ్ (ఫైల్‌ఫొటోలు)

చిట్టమూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మొలకలపూడి రోడ్డు మలుపు సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పెన్నెపల్లికి చెందిన వెంకటరమణయ్య, భార్య నవీనమ్మ, పిల్లలు కిషోర్, స్వర్ణ ఆదివారం నాయుడుపేట మండలం గొట్టిప్రోలు చర్చికి వెళ్లి వస్తున్నారు. వాకాడు చర్చి కాంపౌండ్‌కు చెందిన కావలి కిరణ్ నాయుడుపేట నుంచి వాకాడుకు బైక్‌లో వెళుతున్నారు. చిట్టమూరు మండలం మొలకలపూడి మలుపు సమీపంలో ఈ రెండు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. వెంకటరమణయ్య(40), కావలి కిరణ్ (36) అక్కడికక్కడే మృతి చెందగా, నవీనమ్మ, కిషోర్, స్వర్ణలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ చిన్న బలరామయ్య తన సిబ్బందితో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



తూపిలిపాళెం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

తీరం.. అల్లకల్లోలం

అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరం అల్లకల్లోలంగా మారడంతో అలలు ఎగిసిపడుతున్నాయి. వాకాడు, కోట, చిల్లకూరు సముద్రతీరంలో తీరంలో 3 మీటర్ల ఎత్తున కెరటాలు ఎగిసిపడుతున్నాయి. 5 మీటర్లు ముందుకు సముద్రం చొచ్చుకొనిరావడంతో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులు వేట కొనసాగించలేని పరిస్థితి నెలకొందని మత్స్యకారులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

దంచికొట్టిన వాన











తిరుపతిలో ఆదివారం రాత్రి వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో ప్రారంభమై దాదాపు రెండు గంటల పాటు కురిసింది. ఈ వర్షానికి నగర వీధులు నదులను తలపించాయి. రైల్వే అండర్ బ్రిడ్జిలు, ప్రధాన కూడళ్లలో నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అన్నారావు కూడలి నుంచి ఖాదీకాలనీ మార్గంలో ఓ భారీ వృక్షం నేలకూలింది. మూడు దశాబ్దాల కాలంనాటి ఈ చెట్టు కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి నానడంతో కూలిపోయింది. ఆ సమయంలో వాహనదారులు, పాదచారుల సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం అధికారులు చెట్టును తొలగించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



అమ్మవారి దర్శనానికి తోపులాట





దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు - తొక్కిసలాటతో చిన్నారిని భుజంపైకి ఎక్కించుకుని..



తోపులాటలో నలిగిపోతున్న భక్తులు

● క్యూలైన్‌లో ఇబ్బంది పడ్డ భక్తులు

తిరుచానూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఆలయ పరిసరాల్లో రద్దీ కనిపించింది. మధ్యాహ్నం మూడో నెంబరు గేటు వద్ద టిక్కెట్ల కోసం భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. క్యూలైను నుంచి భక్తులు వెలుపలకు వచ్చారు. దీంతో కాసేపు క్యూలైన్‌లో గందరగోళం ఏర్పడింది. సర్వదర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వేచి ఉండేందుకు వసతి గృహం లేకపోవడంతో అమ్మవారి నైవేద్యం సమర్పించిన తరువాత ఒకసారిగా భక్తులను క్యూలైన్లలోకి పంపించారు. దీంతో తోపులాట జరిగి భక్తులు ఇబ్బంది పడ్డారు. చిన్నారులు, వృద్ధులతో వచ్చిన భక్తుల అవస్థలు వర్ణనాతీతం. కొందరు గేట్లు దూకి బయటకు వచ్చారు. లడ్డుకౌంటర్ వద్దా రద్దీ కనిపించింది.ఇలాంటి సమయాల్లో అదనపు విజిలెన్సు సిబ్బందిని పర్యవేక్షణకు నియమిస్తే తోపులాటను నియంత్రించవచ్చు.

పవన్‌పై దాడి వెనుక 15 మంది

- కొందరు తిరుపతి వైసీపీ నేతల హస్తం
- చిత్తూరులో షెల్టర్ ఇప్పించిన ఐదుగురిని గుర్తించిన పోలీసులు
- కాల్‌డేటా, సాంకేతిక ఆధారాలతో విచారణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పవన్‌కుమార్‌పై దాడి ఘటనలో పోలీసులు విచారించే కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడి వెనుక మొత్తం 15 మంది ఉన్నట్లు.. వారిలో తిరుపతికి చెందిన ఐదారుగురు కీలక నేతల హస్తం ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడైన వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, అతని అనుచరుడు జగదీశ్వరరెడ్డి, దినేష్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో పాకాలకు చెందిన వైసీపీ నేత దినేష్ పవన్‌ను ఫైబర్ లాఠీతో పాటు దుడ్డు కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. ఇతడిని పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. ఇక, పవన్‌కుమార్‌ను దాడి తర్వాత చిత్తూరుకు కారులో తీసుకెళ్ళి అక్కడ బంధించి షెల్టర్ ఇప్పించిన ఐదుగురిని పోలీసులు గుర్తించి, విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పవన్‌కుమార్‌తో ఎవరెవరికి ఎలాంటి సంబంధాలున్నాయి? అతడు పనిచేస్తున్న లాడ్జి యజమాని, మేనేజర్‌ను విచారణ చేస్తున్నట్లు తెలిసింది. బాధితుడు పవన్‌తోపాటు, అరెస్టయిన ముగ్గురు నిందితుల మొబైల్ ఫోన్లు సీజ్ చేసిన పోలీసులు, వారి కాల్ డేటాను సమగ్రంగా పరిశీలించారు. నెల రోజులుగా ఎవరెవరితో మాట్లాడారనే కాల్ డేటా తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు సాంకేతిక ఆధారాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో కేసును ఛేదించే పనిలో తిరుపతి పోలీసులున్నారు. ఇక, తిరుపతి ఆర్టీసీ బస్టాండు నుంచి పవన్‌కుమార్‌ను ఎవరు.. ఏ రూటులో తీసుకెళ్లారనేది సీసీ కెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్‌కుమార్ రెడ్డి బైక్ రెంటల్ కార్యాలయంలో వున్న సీసీ కెమెరాలనుంచీ ఫుటేజీలను సేకరించారు. అన్ని ఆధారాలతో సమగ్రమైన వివరాలతో మరో ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

భూమనకు కౌంట్ డౌన్ స్టార్ట్

- జెరాక్స్ షాపు పెట్టుకున్న మీకు రూ.వేల కోట్లు ఎలా వచ్చాయ్?
- తండ్రీ కొడుకలిద్దరినీ ఒకే జైలుకు పంపుతాం
- టీడీపీ జాతీయ అధికారప్రతినిధి పట్టాభి ధ్వజం



తిరుపతి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): 'ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి అనేక అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారు. ఇక్కడి వారిని వేధించుకు తింటున్నారు. వారి పాపాలు పండి, కౌంట్ డౌన్ స్టార్ట్ అయిపోయింది' అని టీడీపీ జాతీయ అధికారప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల దళిత యువకుడు పవన్ కుమార్‌ను భూమన అనుచరులు అనిల్ రెడ్డి, జగ్గా రెడ్డి, దినేష్‌తో చిత్రహింసలు పెట్టిన వీడియో చూసి అందరూ నివ్వెరపోయారు. కేసు నమోదు చేశాక మళ్లీ బెదిరించి, మా అన్నే కొట్టాడని బాధితుడి చేత చెప్పించారు. కిడ్నాపర్ల చెర నుంచి పవన్‌ను పోలీసులు రక్షించి, నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ అఘాయిత్యాన్ని వెనుకనుంచి నడిపించిన తండ్రీ కొడుకులను విడిచిపెట్టేది లేదు' అని స్పష్టం చేశారు. జెరాక్స్ షాపు పెట్టుకున్న నీకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయంటూ భూమనను పట్టాభి ప్రశ్నించారు. 'మీ భూకబ్జాలు, అవినీతి, అక్రమాలపై మా దగ్గర ఆధారాలున్నాయి. స్వర్ణముఖి నదీపరీవాహక ప్రాంతంలో (సర్వే నెంబరు 479) 9 ఎకరాలు కబ్జా చేసింది నిజం కాదా? 472,3,4లో 15.64 ఎకరాలు భూమి ఉంటే దానికి అనుగుణంగా నదీగర్భాన్ని కూడా మట్టితో పూడ్చేశావు. కబ్జా చేయలేదని నిరూపించే శక్తి నీకుందా? మీడియా ముందు నీతికథలు చెబుతూ...తెరవెనుక అంతుపట్టని అక్రమాలు చేస్తావు. టీటీడీ, తుడా చైర్మన్‌గా ఉన్నప్పుడే 21 ఆస్తులు కొనుగోలు చేసినట్టు నువ్వే ఎలక్షన్ అఫిడవిట్‌లో చూపించావు. మాస్టర్ ప్లాన్ పేరిట టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి తెరలేపారు. టీడీఆర్ బాండ్ల అవినీతిపై విచారణ పూర్తయింది. ఏతండ్రైనా కొడుకును ప్రయోజకుడు చేయాలని చూస్తారు. నువ్వేమో పరమ బడుద్దాయి లాగా తయారు చేశావు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికలో అప్పటి డీసీ చంద్రమౌళీశ్వర్ రెడ్డిని అడ్డుపెట్టుకుని దాదాపు 35వేల దొంగ ఓట్లు తయారు చేయలేదా? ఈసీ విచారణలో నిర్ధారణ కావడంతో డీసీని సస్పెండ్ చేయడంతో పాటు ఓ ఐఏఎస్ అధికారిపై మచ్చపడలేదా? దీనివెనుక సూత్రధారులు మీరు కాదా? మీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆధారాల సహా తండ్రీ కొడుకులను ఒకే జైలుకు పంపుతాం' అని పట్టాభి అన్నారు. ప్రశాంతంగా ఉన్న తిరుపతిని తండ్రీ కొడుకులు భ్రష్టు పట్టిస్తూ కూటమి ప్రభుత్వంపై లేనిపోని అబాండాలు వేస్తున్నారని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మండిపడ్డారు. ఎన్ని నాటకాలు వేసినా భూమన కుటుంబానికి రాజకీయ భవిష్యత్తు లేదని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మ, సుబ్బు యాదవ్, అత్తులూరి ఆనంద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి



గురవయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న కందమూడి శివకుమార్

పెళ్లకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని జీలపాటూరుకు చెందిన టీడీపీ కార్యకర్త కత్తి గురవయ్య(42) నాయుడుపేట సమీపంలో శనివారం రాత్రి మృతి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెందాడు. నాయుడుపేట పట్టణంలో ఓ కార్యక్రమానికి హాజరైన గురవయ్య రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు పంచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్, టీడీపీ నాయకులు పళని, ఆరూరు ప్రకాశం, రజినీ, శింగమాల వెంకటరాజా తదితరులు ఆదివారం గురవయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

సూళ్లూరుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ ఏఐటీయూసీ నాయకులు స్థానిక వినాయకుడి గుడిసెంటర్‌లో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు గత ప్రభుత్వం దారి మళ్లించిన రూ.1200 కోట్లు తిరిగి బోర్డుకు జమచేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తే ఆయన తనయుడు జగన్ సీఎం రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు కత్తి రవి, నాయకులు వెంటకకృష్ణయ్య, రమణయ్య, బాలు, హనుమంతరాజు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి



సురేష్‌నాయుడును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

దొరవారిసత్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండల బీజేపీ మండల కమిటీ ఎంపిక ఆదివారం స్థానిక పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సంబారెడ్డి సురేష్ నాయుడు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవులు పొందినవారు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని కోరారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే 12వ తేదీన మొదటి సారిగా తిరుపతికి వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదినారయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు అమరావతి రామయ్య, రంగినేని కృష్ణయ్య, ఈశ్వరయ్య, వెంకటరమణ నాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు పెరిగి పేదలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ.రమణయ్య, ప్రసాద్, మణి, సుబ్బయ్య, చంద్రయ్య, ప్రభాకర్, సీవీఆర్ కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెగా అభిమానుల సేవలు ప్రశంసనీయం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి అభిమానులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా అఖిలభారత చిరంజీవి యువత, మెగా బ్రదర్స్ సేవాసమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, పగడాల మురళి, కొట్టే వెంకటేశ్వర్లు, సుజయ్‌బాబు, చిన్నా, విజయలక్ష్మీ, సారంగం సులక్ష్మి, కొత్తపల్లి వసంత్‌కుమార్, శివప్రసాద్, శ్యామ్, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కండి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న గంగాప్రసాద్, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండెపాటి గంగాప్రసాద్ అన్నారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధ్యక్షతన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు నాయుడుపేట పట్టణ, మండల, పెళ్లకూరు, ఓజిలి మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, అన్నదాత సుఖీభవ, పింఛన్లు, తల్లికి వందనం, సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు గురించి సమీక్షించారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం లభిస్తుందన్నారు. ఒకే పదవికి పోటీ ఎక్కువగా ఉన్న పక్షంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీకి అందరూ సమానమేనని ఎక్కువ తక్కువలు ఉండవన్నారు. చిన్నచిన్న మనస్పర్థలు ఉంటే కలిసి మాట్లాడుకొని పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో నెలవల రాజేష్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, దార్ల రాజేంద్ర, మైలారి రాజశేఖర్, నానాబాల సుబ్బారావు, గంగాప్రసాద్, సంచి కృష్ణయ్య, మురళీరెడ్డి, రమేష్ నాయుడు, దారా అంకయ్య, సుజాతమ్మ, కన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాలాయపల్లి: సింగిల్ విండోల అధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు, భాస్కర్‌రావు, సత్యం నాయుడు, ప్రభాకర్, ఆది వెంకటకృష్ణారెడ్డి

సింగిల్ విండోలకు అధ్యక్షుల నియామకం

బాలాయపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలో ఐదు సింగిల్ విండోలకు అధ్యక్షులను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బాలాయపల్లి సొసైటీ అధ్యక్షుడిగా రాయి సత్యం నాయుడు, జయంపు సొసైటీ అధ్యక్షుడిగా సింగంశెట్టి భాస్కర్ రావు, భైరవరం సొసైటీ అధ్యక్షుడిగా దాసరి ప్రభాకర్ నాయుడు, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడిగా ఆదివెంకటకృష్ణారెడ్డి, యాచవరం సొసైటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ నాయుడు నియమితులయ్యారు.

ఓజిలి: మండలంలోని కుందాం, కురుగొండ సొసైటీలకు అధ్యక్షులను ప్రభుత్వం నియమించింది. కుందాం సొసైటీ అధ్యక్షుడిగా ఆరిమేనిపాడుకు చెందిన గుంటమడుగు పురుషోత్తంరాజు, కురుగొండ సొసైటీ అధ్యక్షుడిగా కురుగొండకు చెందిన దారా అంకయ్య నియమితులయ్యారు. అలాగే కుందాం సొసైటీ డైరెక్టర్లుగా కుందాం గ్రామానికి చెందిన పి.బాలగురునాథం, అత్తివరానికి చెందిన ఎల్లు వెంకటయ్య, కురుగొండ సొసైటీ డైరెక్టర్లుగా ఓజిలికి చెందిన ఏ.మల్లిఖార్జున్‌రెడ్డి, రాచపాళెం గ్రామానికి చెందిన ఎం.రవీంద్రరాజును నియమించారు.

వెంకటగిరి: మండలంలోని వెంకటగిరి, లాలాపేట, యాతలూరు సింగిల్ విండోలకు అధ్యక్షులను ప్రభుత్వం నియమించింది. వెంకటగిరి సొసైటీ అధ్యక్షుడిగా పప్పు చంద్రమౌళిరెడ్డి, లాలాపేట సొసైటీ అధ్యక్షుడిగా గొల్లగుంట వెంకటముని, యాతలూరు సొసైటీ అధ్యక్షుడిగా గుత్తికొండ బాబురావు నియమితులయ్యారు.



ఓజిలి: పురుషోత్తంరాజు, అంకయ్య - వెంకటగిరి: పప్పు చంద్రమౌళిరెడ్డి, వెంకటముని, బాబురావు

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ డిపోలో పనిచేసేందుకు ఆన్‌కాల్ డ్రైవర్లు కావాలని డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. హెవీ లైసెన్స్, 18 నెలల అనుభవం, అభ్యర్థి వయస్సు 55 ఏళ్ల లోపు ఉండాలన్నారు. అర్హత ఉన్న వారు పూర్తి వివరాలతో డిపోలో సంప్రదించాలని కోరారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ నాయకులు తడలో ఆదివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో సుస్థిరమైన ప్రభుత్వం కొలువుతీరడంతో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం అమలవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేజారెడ్డి, నాయకులు జ్యోతి, రమేష్, చెంచయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు

వాకాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు కల్లూరు హరీష్ నాయుడు జన్మదిన వేడుకలను వాకాడు, నెలిపూడి, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. హరీష్ నాయుడు కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఆయనను టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కుక్కమల్ల సింహాచలం, గుంటక రమణయ్య, కుక్కమల్ల చంద్రయ్య, కుక్కమల్ల మనోజ్, ఇంగిలీల వెంకటేశ్వర్లు, కావలి సుబ్రహ్మణ్యం, కుంభాల రమణయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీహరి, కస్తూరయ్య, ఇంగిలాల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముడి ఆహార పదార్థాలతో ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న యోగా శిక్షకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ముడి ఆహార పదార్థాలు తీసుకుని ఆరోగ్యంగా ఉందామని పతాంజలి యోగా ప్రతినిధి కైలాష్‌సింగ్‌రాజ్ పురోహిత్, నగరానికి చెందిన యోగా గురువు రఫీ హిందూస్తానీ అన్నారు. స్థానిక మంచినీళ్లగుంట వెనుక ఉన్న విద్యోదయ స్కూల్ ఆవరణలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం అమృత ఆహారం(రా ఫుడ్)పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సహజసిద్ధంగా పండే ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, గింజలు, బూడిద గుమ్మడికాయలతో పెరుగన్నం, బీట్రూట్ హల్వా, కూరగాయలతో జిలేబీలు తయారు చేసుకుని తింటే ఆయుష్షు పెరుగుతుందన్నారు. మాంసాహారం వీలైనంత వరకు తగ్గించాలని సూచించారు. రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధికమించవచ్చని వివరించారు.

డీఐజీకి ఎమ్మెల్యేల పరామర్శ



గోపీనాథ్ జెట్టిని పరామర్శిస్తున్న గంగాప్రసాద్, కురుగొండ్ల, పాశిం

ఓజిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కరబల్లవోలుకు చెందిన డీఐజీ గోపీనాథ్ జెట్టిని ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్ పరామర్శించారు. గోపీనాథ్ తండ్రి జెట్టి పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం గ్రామంలో నిర్వహించిన కర్మక్రియలకు ఎమ్మెల్యేలు హాజరై పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, ఎస్కే ఖలీల్ తదిరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

గూడూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక టిడ్కో గృహాల వద్ద పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధుల పరిష్కారమే లక్ష్యం

ముగిసిన అప్సా రాష్ట్ర సదస్సు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో పల్మనాలజిస్టులు నిత్య వైద్య విద్యార్థులుగా ఉంటూ నివారణకు కృషి చేయాలని అప్సా(ఆంధ్రప్రదేశ్ సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియేషన్) ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రేమానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావు అన్నారు. మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అప్సా 6వ వార్షికోత్సవ సదస్సు ఆదివారం ముగిసింది. వారు మాట్లాడుతూ పల్మనరీ విభాగంలో వస్తున్న ఆధునిక వైద్య పద్ధతులు, మెళకువలు, అనుభవాలను పంచుకోవడంతోపాటు నేర్చుకునే అవకాశం ఇలాంటి సదస్సుల ద్వారా కలుగుతుందని తెలిపారు. తద్వారా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్ ఎక్స్‌ట్రా పల్మనరీ టీబీ, డాక్టర్ సుబ్బారావు అండర్‌స్టాండింగ్ లేటెంట్ టీబీ, డాక్టర్ రఘు షార్టర్ రెజిమెన్స్, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యన్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ఇన్ ట్యూబర్క్యులోసిస్ అంశాల గురించి వివరించారు. ప్రముఖ పల్మనాలజిస్టులు ఊపిరితిత్తుల వ్యాధులపై చేసిన పరిశోధన పత్రాలను సమర్పించారు. పల్మనరీ విభాగంలోని నూతన ఆవిష్కరణలు, అధునాతన వైద్య పరికరాలు, వైద్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఉత్తమ పరిశోధనా పత్రాలను అందించిన పీజీ వైద్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ప్రముఖ వైద్యులు విజయ్, హరికృష్ణ, సునీల్‌కుమార్, సురేంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రమణ సూచించారు. ఆదివారం స్థానిక వెంకటగిరి పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా డ్రోన్ ద్వారా నిఘా పెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో సేవిస్తున్నారని సమాచారం అందడంతో డ్రోన్ ద్వారా నిఘా పెట్టి పట్టుకుని శిక్షిస్తున్నామన్నారు. టిడ్కో గృహాలు దూరంగా ఉన్నందున రాత్రి పూట ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే 100 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

గణేశ్ మండపాల ఏర్పాటు, విగ్రహప్రతిష్ఠ చేయాలంటే తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, రాత్రి 10గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఇతర మతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

గూడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు భరోసా కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో చేనేత కార్మికుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగ్గాలు నేసే చేనేతలకు నెలకు 200యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, కటికాల శ్రీనివాసులు, పడాల రత్నయ్య, రవీంద్రరెడ్డి, శ్యామల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయ కుంభాభిషేకం



సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

కోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సంగమేశ్వరాలయంలో మూడు రోజులపాటు జరిగే కుంభాభిషేకాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న కామాక్షీదేవి విగ్రహాన్ని తొలగించి, దానిస్థానంలో నూతన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించేందుకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మేళతాళాలతో కుంభాభిషేకాలకు అంకుర్పాణ జరిగింది.

కేశవరంలో మల్లికార్జునస్వామి విగ్రహప్రతిష్ఠ



ఆలయ ప్రాంగణంలో ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న కలశాలు, హోమాలు

కోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో గల శివతోటలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి మహా కుంభాభిషేకాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల విగ్రహాలతో గ్రామోత్సవం జరిగింది. యాగశాలలో దీక్షా హోమాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా రాజగోపురానికి భూమిపూజ

టీటీడీలో విలీనం చేసుకోవాలని వినతి



భూమిపూజలో ఎమ్మెల్యే భానుప్రకాష్, ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్

నిండ్ర, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నిండ్రలో టీటీడీ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న రాజగోపురానికి ఆదివారం భూమిపూజ వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిండ్ర గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్ ఎమ్మెల్యేకు ఆలయ పూర్వ వైభవాన్ని, విశిష్టతను వివరించారు. ఆలయం శిథిలమైన తరువాత అదేస్థానంలో నూతనంగా నిర్మించిన ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేయాలని కోరారు. ఈ ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని రమేష్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి నిండ్ర గ్రామానికి చెందిన బలిజ సంఘం వారు కూడా నగదు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.